# పద్మశ్రీ ప్రొఫెసర్

సాయంత్రం నాలుగంటలు కావస్తోంది.

శీతాకాలపు చల్లనిఎండ కిటికీనుండి వచ్చి నుదుటిని నులివెచ్చగా తాకుతుంటే 'ఓ అంటూ ఓ సారి పెద్దగా ఆవలించి సోఫాలో చేరగిలబడి మత్తుగా కళ్ళుమూసుకున్నాడు ప్రొఫెసర్ రంగారావు అతనున్నది ఆ సమయంలో పాథాలజీ లేబరేటరీలో. ఉదయం తొమ్మిదిగంటలనుండి సాయంత్రం ఆరుగంటలదాకా అక్కడ ముగ్గురు రిసెర్చి స్కాలర్లు అతని 'గైడెన్స' క్రింద పనిచేస్తుంటారు డాక్టరేట్ కోసం.

ఆ ముగ్గురూ తలోక స్టూలుమీద కూర్చుని వంచిన తల ఎత్తకుండా మైక్రోస్కోపుముందు పనిచేస్తూనేఉంటారు. అలా కష్టపడి రాత్రిబవళ్లు శ్రమించి మూడు నాలుగుసంవత్సరాలలో డాక్టరేట్ పట్టాపొంది, పెద్దపెద్ద ఉద్యోగాలు

సంపాదించి యిటు ఇండియాలోనే కాక అటు విదేశాలలో స్థిరపడిపోయిన వాళ్ళెందరినో అతడు 'గైడు' చేసేడు, కనీసం అతని క్రింద పనిచేసిన రిసెర్చి స్కాలర్సు డెబ్భైమందిదాకా అయినా ఉంటారు.

అయితే అతను రిసెర్చి స్కాలర్సును ఎవరినిబడితే వాళ్ళను తీసుకోడు ఎంతో మేధావంతులు, కార్యదీక్షగల వారు అయిన విద్యార్థులు మాత్రమే అతనికి శిష్యులుగా ఉండటానికి అర్హులు. అన్నిటికన్నా మిన్నగా ప్రొఫెసర్ రంగారావుకి వినయవిధేయతలుగల విద్యార్థులంటే మరీ మోజు. తనముందు చేతులు కట్టుకొని నిలబడి తనన్న ప్రతి మాటకీ 'ఎస్సార్' "ఎస్సార్!" అంటూ వినయంగా జవాబిచ్చే స్టూడెంట్లను అతను చాలా అభిమానిస్తాడు అందుకే యూనివర్సిటీలో ఏ సబ్జక్టులోనైనా రిసెర్చి స్కాలర్‌గా చేరటం సులభంకాని బోటనీలో అందునా పాథాలోజీలో సీటుదొరకటం అంత సులభమైన విషయంకాదు. ఫస్టుక్లాసు మార్కులు వచ్చి పాథాలజీలో చాలా యింటరెస్టు ఉన్న విద్యార్థులెందరో ప్రొఫెసరు రంగారావు పెట్టిన పరీక్షలకు తట్టుకోలేక పారిపోయిన వాళ్ళున్నారు.

ప్రొఫెసరు రంగారావు గైడెన్సుక్రిందడాక్టరేట్ సంపాదించిన విద్యార్థి అంటే ఆ యూనివర్సిటీకి మంచిగౌరవం ఉంది. వాళ్ళకు ఉద్యోగాలివ్వటానికి లేని ఉద్యోగాలను

కూడా కల్పించి యివ్వటానికి అన్నిసంస్థలు యూనివర్శిటీలు సిద్ధంగా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు.

రంగారావు ఓ చిన్న కునుకుతీసి కళ్ళు తెరిచేసరికి అప్పుడే అయిదయిపోయింది. శీతాకాలం అవటంవల్ల ఐదింటికే వాతావరణం చల్లబడిపోయింది. వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న ప్రొఫెసరుగారిశరీరం ఉల్లెన్ కోటులోఉన్నా చలికి వణికిపోతోంది. అరచేతులు రెండూ ఒకదాని కొకటి రాచుకుని వేడి చేసుకుంటూ మరోసారి పెద్దగా ఆవలించి, పళ్ళు విరుచుకుని కుర్చీలోనుండి లేచేడు రంగారావు.

ఐతే అతని ఆవలింతలుగాని, అతను చేసే యితర శబ్దాలు కాని ఆముగ్గురు రిసెర్చి స్కాలర్సుయొక్క ఏకాగ్రతకు ఏమాత్రం భంగం కలిగించలేదు. అవి వాళ్ళకు రెండు సంవత్సరాలుగా వినీవినీ ఉండటంవల్ల అలవాటైపోయినయ్. తాము పనిచేస్తున్నంతసేపూ నిద్ర నాపుకోవటానికి కాలక్షేపం చెయ్యటానికి ప్రొఫెసరుగారు పడే అవస్థ వాళ్ళకు బాగా తెలుసు. కాని తమ భవిష్యత్తంతా ఆయన చేతుల్లో ఉన్నదన్న సత్యంకూడా అంతకన్న ఎక్కువగా తెలియటం వల్ల వాళ్ళు మాత్రం ఆయన ఉనికి నేమాత్రం గుర్తించనట్లు నటిస్తూ తమ పనిలో తాము మునిగిపోతారు.

ప్రొఫెసరు రంగారావు వ్యక్తిత్వాన్ని గురించి చెప్పాలంటే ఆయనకింద పనచేసే విద్యార్థుల దృష్టిలో ఆయనకు గల స్థానాన్నిబట్టి యిలా చెప్పవచ్చు.

ప్రొఫెసర్ రంగారావుని మొట్టమొదటగా చూసిన ఏ విద్యార్థికైనా నీటుగా ఎల్లప్పుడూ సూటులో కనబడే ఆరడుగుల విగ్రహం. నిమ్మకాయలను నిలబెట్టగల మీసకట్టు. పొడుచుకు వచ్చినట్లు గాజు గోళాల్లా ఎరుపు జీరలతో కనబడే నిలువుగుడ్లు చచ్చేభయాన్ని కలిగిస్తయ్ భయం అనగానే దాని వెనుకనే కాస్త భక్తికూడా ఉంటుంది. కనుక ఆయనను చూసిన మొదటి క్షణంలోనే ప్రతివిద్యార్థీ గౌరవిస్తాడు.

ఇంటర్వ్యూలో ఆయన వేసే తికమక ప్రశ్నలకు తల తిరిగిపోవటంతో ఆ గౌరవం పదింతలవుతుంది. ఏలాగో ఆయన దగ్గర శిష్యరికం పొందే అర్హతను సంపాదించిన తరువాత క్రమంగా ఆయన సోమరితనం అజ్ఞానం యింకా చెప్పాలంటే బుద్ధిహీనత మొదలైన అవలక్షణాలన్నిటినీ స్పష్టంగా తెలుసుకోగలుగుతారు. అప్పటికే వాళ్ళు డాక్టరేటుకోసం చేసే కృషి సగంపైగా అయిపోవటంవల్ల ఆయనకు పొట్టకోస్తే ఒక్కఅక్షరం ముక్కరాదనీ ఆయనది విగ్రహపుష్టే తప్ప మేధాశక్తి అత్యల్పమైనదీ అని తెలిసినప్పటికీ ఆయనను అగౌరవపరచే ధైర్యంలేక, మరింత వినయవిధేయతలు ఆయన ముందు ఒలకబోసి 'డాక్టరేట్‌ని' సంపాదిస్తారు.

ఐతే డాక్టరేటు సంపాదించి బయటపడ్డప్పటికీ ఆయననుగురించి తేలికగా మాట్లాడే ధైర్యం వాళ్ళకు ఉండదు. ఎందుకంటే అంతటి తెలివిహీనునిద్వారా పొందిన తమ'డాక్టరేట్'ని యితరులు ఎక్కడ అగౌరవపరుస్తారోనని వారి

భయం ముఖ్యంగా సైన్సు సబ్జక్టులలో గురువుగారిని బట్టి శిష్యుల అర్హతలను అంచనా వెయ్యటం ఆనవాయితీ! అందుకే తమ ఆధిక్యతను చాటుకునే నిమిత్తం తమ గురువుగారి బుద్ధిహీనతను రహస్యంగా తమ మనసుల్లోనే ఎవరికి వారుంచేసుకుని తాము ఫలానా ప్రొఫెసరు రంగారావుగారి శిష్యులమంటూ రొమ్ము విరుచుకుని మరీ చెప్తారు ఏ ఇంటర్వ్యూలోనైనా సరే.

అసలు రంగారావు ప్రొఫెసరు కావటంకూడా చాలా చిత్రంగా జరిగింది. ఆయన బి. యస్సీ నాలుగుసార్లు తప్పి చివరకు ఐదోసారి బోటాబొటీగా ప్యాసు మార్కులు తెచ్చుకున్నాడు. ఆ తరువాత ఒక పెద్దమనిషి పలుకుబడిని వినియోగించుకుని ఎమ్మెస్సీలో సీటు తెచ్చుకుని మొదటి ఛాన్సులోనే థర్డుక్లాసులో బయటపడ్డాడుకాని చిన్నప్పటినుండీ ఆయనకు డిగ్రీలమీద మోజుండడంవల్ల, పైగా ఆగర్భ శ్రీమంతుడవటంవల్లను, సొంత డబ్బు పెట్టుకుని ఇంగ్లండు వెళ్ళి ఒక సైంటిఫిక్ కంపెనీలో ఉద్యోగం చేసి ఎలాగో తంటాలుపడి 'డాక్టరేట్' సంపాదించుకుని ఐదు సంవత్సరాల్లో తిరిగి స్వదేశానికి వచ్చేడు. అప్పటికి యూనివర్శిటీలో బోటనీ డిపార్టుమెంటులో విదేశీయ డిగ్రీలున్నది ఆయన కొక్కడికే అవటంవల్ల మూడేళ్ళు రీడరుగా పనిచేసి తమ ప్రొఫెసరు రిటైరవటంతో తనకంటె సర్వీసులో సీనియారిటీ ఉన్న వాళ్ళందరినీ తలదన్ని తానే ప్రొఫెసరయ్యాడు.

ఆయన ప్రొఫెసర్ కాకముందు కల ఆయన గత చరిత్రను గురించి ఏ కొద్దిమందికో తప్ప తెలియదు. తెలిసిన ఆ కొద్దిమందికూడా ఎక్కడెక్కడో ఉన్నారు తప్ప ఆయనకు దగ్గరోఅయితే లేరు, అందుకే ప్రొఫెసర్ గా ఆయన కీర్తిప్రతిష్ఠలు యిట్టే మిన్ను ముట్టిపోయినయ్ అకారణంగా అప్రయత్నంగా కీర్తి దేవతచేత వలపింపబడే అత్యల్ప సంఖ్యలోని అదృష్టవంతులలో ప్రొఫెసర్ రంగారావు ఒకడు.

బద్ధకంగా వళ్ళు విరుచుకుని లేచిన తరువాత నాలుగు సార్లు అటూయిటూ పచార్లుచేసి, 'శంకర్' అనే రిసెర్చి స్కాలర్ దగ్గరకు వెళ్ళేడు.

'ఏమోయ్ శంకర్! ఎంతవరకొచ్చిందేమిటి?" అంటూ అతని బుజంమీద చెయ్యి వేసేడు.

శంకర్ తటాలున లేచి నిలబడి "మీరిచ్చిన స్పెసిమన్ని నాలుగురోజులనుండి 'స్టడీ' చేస్తున్నానండీ, ఇంత వరకు దాని స్ట్రిక్చరు బోధపడటంలేదు" అంటూ వినయంగా సమాధానమిచ్చేడు శంకరు.

"ట్రై అండ్ సీ..." అంటూ మిగతా యిద్దరిదగ్గరకు కూడా వెళ్ళి వాళ్ళను కూడా ఏవో ప్రశ్నలువేసి వచ్చి మళ్ళీ సోఫాలో కూలబడి టైము చూసుకున్నాడు మరో అర గంటకుగాని వీళ్ళు లేవరు. అంతదాకా తను కూర్చోవలసిందే! లేకపోతే ప్రొఫెసరు తమమీద యేమాత్రం శ్రద్ధ చూపటం లేదని వాళ్ళు అనుమానపడవచ్చు. ప్రొఫెసరు కళ్ళు

కానేపు 'శంకరు' మీద వాలి అతనిని నిశితంగా పరిశీలించి నయ్.

శంకరు చాలా చురుకైన విద్యార్థి, అ మాటకొస్తే తన దగ్గరకు వచ్చే విద్యార్థులందరూ చాలా చురుకైనవాళ్ళే! కాని శంకరుది చాకులాటి మెదడు. అతను ఫంగస్‌జాతికి చెందిన ఒక ప్లాంటును స్టడీచేస్తున్నాడు. అది పైరుపంటలను ఒకరకమైన వ్యాధిని సంక్రమింపజేసేదవటంవల్ల శంకరు కనుక దానినిగురించిన విషయాలను సాధ్యమైనంత ఎక్కువగా సేకరించినట్లయిన అతని పరిశోధన ఫలితాలు వ్యవసాయదారునికి తద్వారా దేశానికి లాభం కలిగే అవకాశముంది.

శంకరులోని కార్యదీక్ష ఏకాగ్రత. ప్రొఫెసరు రంగారావుని చాలా ముగ్ధుడ్ని చేసినయ్. ఒక విషయాన్ని గురించి చదివేటప్పుడు దాని పూర్వాపరాలు తెలుసుకుని దానిని గూర్చి క్షుణ్ణమైన పరిజ్ఞానాన్ని సంపాదిస్తే తప్ప అతనికి నిద్ర పట్టదు. రంగారావుదగ్గర పనిచేసిన విద్యార్థులందరూ ఎంత తెలివిగలవాళ్ళయినా వాళ్ళకెప్పుడూ విజ్ఞానంమీదకన్న తాము పొందబోయే డాక్టరేట్ మీదనే ధ్యాస ఎక్కువగా వుండేది. ఆ సంగతి ప్రొఫెసరుకికూడా బాగా తెలుసు

కాని శంకరు అలా కాదు. డిగ్రీమీద ఆశకన్న ఎక్కువగా దేనినో శోధించి తెలుసుకోవాలని ఒక కొత్తవిషయాన్ని ప్రయత్నించి తెలుసుకొని, సాధించాలన్న తహతహ కనపడుతుంది అతనిలో అందుకే ప్రొఫెసరు రంగారావుకి

శంకరు అంటే లోలోపల భయం, గౌరవంకూడా ఉన్నయ్. అలాటి విద్యార్థి తనక్రింద పనిచెయ్యటం నిజంగా తన అదృష్టమనే అనుకున్నాడు రంగారావు. అతనివల్ల తన కీర్తిప్రతిష్ఠలు మరింతగా పెరుగుతయ్.

ప్రొఫెసరు కేవలం షోకోసం తెప్పించే సైంటిఫిక్ మాగజైన్సనన్నిటినీ శంకరు మూలాగ్రంగా చదివి ఎప్పటికప్పుడు శాస్త్రవిజ్ఞానంలో జరుగుతున్న పురోగమనాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తుండేవాడు. తను చేబట్టిన ప్రతి చిన్న పనిలోనూ ఒక కొత్తదనాన్ని చూపెట్టడం, అంతకు ముందు ఎవరూ గమనించని కొత్తదనాన్ని అతను గుర్తించటం అతనిలోని విశేషం.

తను ఎంతో ఖర్చుపెట్టి కొనే మాగజైన్లను ఒక్కసారైనా చదివిన పాపానపోలేదు. ప్రొఫెసరు రంగారావు ఇరవై సంవత్సరాల క్రితం టెస్టుబుక్కు చదవవలసిన అవసరం ఎప్పుడు తప్పిందో అప్పుడే అతని చదువుమీద ధ్యాసకూడా తగ్గిపోయింది. అతను 'డాక్టరేట్' డిగ్రీని తీసుకోగానే అతని మెదడు తన సహజమైన జడత్వాన్నికూడా తిరిగి చేకూర్చుతుంది.

"ఫోజు"కోసం నలుగురుముందూ ఏదో పేజీలు తిరగవేస్తాడు కాని అందులో ఒక్కముక్కన్నా చదవడు చదివినా అర్థంకాదని అతనికి తెలుసు.

చివర కెలాగైతేనేం సాయంత్రం ఆరుగంటలయేసరికి అందరూ లేచేరు.

శంకరు మాత్రం అయిష్టంగా మైక్రోస్కోపును వదిలి రావటం ప్రొఫెసరు గమనించకపోలేదు. శంకరు విజ్ఞాన దాహం తీరటానికి రోజుకు యిరవై నాలుగుగంటల టైమ్ ఉంటే సరిపోదు. ఆ సంగతి ప్రొఫెసరుకి తెలుసు అందుకే తనలో తాను నవ్వుకున్నాడు "ఫూల్ ఫెలో" అని.

రోజులు మామూలుగా గడచిపోతున్నయ్. పాథాలజీ లాబ్‌లో అదే కార్యక్రమం ప్రతిరోజూ కొంచెం అటూ యిటుగా జరిగిపోతుంది. ప్రొఫెసరు స్వయంగా యిచ్చే గైడ్సుకన్న అతనిచ్చే పుస్తకాల సహాయంతోనే విద్యార్థులు తమ తెలివితేటల నుపయోగించి, డాక్టరేట్లని సంపాదించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు, శంకరు మరో ఆరునెలల్లో డాక్టరేట్ పొందపోతున్నాడనగా ఒక చిత్రమైన విషయం జరిగింది.

శంకరు స్టడీ చేస్తున్న ఫంగస్‌లో ఒక చిత్రమైన ఆకారం కనపించిందతనికి. దానిని అంతకుముందు అత డెప్పుడూ చూడలేదు. అందువల్ల నిద్రమత్తులో జోగుతున్న ప్రొఫెసరుని ఉద్రేకంతో తట్టి లేపేడు శంకరు. "సార్! సార్! జస్ట్ వన్ మినిట్ ఒకసారిలా రండి అంటూ" అతనికి ఆ సమయంలో ప్రొఫెసరు తన ప్రవర్తనకు ఏమనుకుంటాడో నన్న ధ్యాసకూడా లేదు.

ప్రొఫెసరు మైక్రోస్కోపుదగ్గరకువచ్చేలోపలేమిగతా యిద్దరు విద్యార్థులుకూడా శంకరుని అంత ఉద్రేకపూరితం చేసిన ఆ విచిత్రమైన ఆకారమేమిటా అని మైక్రోస్కోపులో నుండి చూసి, యేమీ అర్థంకాక యువతలకు తిరిగి నిల్చున్నారు.

ప్రొఫెసరు వంగి మైక్రోస్కోపులోనుండి చూస్తుంటే దానినిగురించి శంకరు వివరిస్తుంటే వింటున్నాడు. "దీనికి— గోధుమపంటకి పట్టే ఫంగస్‌కి యేదో సంబంధముందని నా కనిపిస్తోంది సార్. దీనిమీద స్టడీ చెయ్యాలని నాకు చాలా కుతూహలంగా ఉంది" అని శంకరు అంటుంటే ప్రొఫెసరు కళ్ళు మిలమిల మెరిసినయ్.

"శంకరు బుజంతట్టి గుబురు మీసాల్లోంచి చిన్నగా నవ్వుతూ" తప్పకుండా స్టడీచెయ్యి శంకర్! నీకు నెలరోజుల్లోనే డాక్టరేట్ యిచ్చే బాధ్యత నాది సరేనా? విష్‌యూ బెస్టాఫ్‌లక్!" అన్నాడు. అబ్బే డాక్టరేట్ మీద నాకంత మోజు లేదండీ. మరీ నెలరోజుల్లోనే సంపాదించటం నాకు యిష్టంగాకూడా లేదు. ఇప్పట్నుంచే ఉద్యోగంలో చేరేనంటే బ్రైన్ పనిచెయ్యటం మానివేస్తుంది. మరో ఆరు నెలల గడువు ఎటుపడీ ఉందికదా. అప్పటిదాకా నేనీ లేబొరేటరీని వదలిపెట్టి పోలేను" అన్నాడు.

రంగారావు ఒకసారిగా శంకరు కళ్ళలోకి ఒంకరగా

చూసి వెంటనే పెద్దపెట్టున నవ్వేస్తూ సరేలేవోయ్! ముందు నీ యీ సరికొత్త పరిశోధన విషయం చూడు దీన్నిగురించి క్షుణ్ణంగా వ్రాసి, ఇరవై రోజులలోపల నాకిచ్చేయాలి. తెలిసిందా?" అంటూ వెళ్ళిపోయేడు.

శంకరు ప్రొఫెసరు అనుమతితో రాత్రిపూటకూడా లేబొరేటరీలో పనిచేసి అతనిచ్చినగడువు పూర్తకాకపూర్వమే అంటే పదహారురోజులలోనే తాను కనిపెట్టిన ఫంగస్‌యొక్క జీవితచరిత్రను దానిని నిర్మూలించే విధానాలనుకూడా వ్రాసి ప్రొఫెసరుకి చూపేడు.

ఆ కాగితాలు కోటుజేబులోపెట్టుకుని ప్రొఫెసరు రంగారావు నవ్వుతూ మిగతా యిద్దరు స్కాలర్సును ఉద్దేశించి మీకు ఒక సంతోషకరమైన వార్తను, మరో రకంగా విషాద వార్తనుకూడా చెపుతున్నాను, మైడియరు బోయస్! శంకరు రేపటినుండి 'డాక్టరు శంకరు కాపోతున్నాడు. మిమ్మల్ని వదిలి ఢిల్లీ యూనివర్శిటీలో 'రీడరు'గాకూడ చాలో కొద్ది రోజులలోనే వెళ్ళబోతున్నాడు" అన్నాడు.

దాంతో శంకరుకి ఆనందంకన్నా ఆశ్చర్యమే ఎక్కువ కలిగింది. "అదేమిటి సార్! అప్పుడే నాకు ఉద్యోగంకూడా చూసి పెట్టేరా? నేను చెయ్యవలసిన పని యింకా చాలా వుంది. అప్పుడే నాకు డాక్టరేట్ యిస్తారా అన్నాడు దీనంగా.

అతని మాటలు వింటుంటే అతని అమాయకత్వానికి

ప్రొఫెసరుకే కాక శంకరు మిత్రులిద్దరికీకూడానవ్వు వచ్చింది. "సిరిరా మోకాలొడ్డువారుందురా?" అని వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయి చూసేరు.

ప్రొఫెసరు పెద్దపెట్టున నవ్వి "యూ సిల్లీబోయ్! ఆరు నెలల కాలాన్ని వ్యర్థం చెయ్యకుండా అనాయాసంగా డాక్టరేట్‌తో పాటు చక్కని యూనివర్శిటీ ఉద్యోగం వస్తుంటే అలా బిత్తరపోతాం వేదుకు? టూసిల్లీ ... టూఫూలిష్! అన్నట్టు రేపు సాయంత్రం మా యింటికి టీకిరా ఆదివారమే కదా? మర్చిపోకు అంటూ వెళ్ళిపోయేడు మిత్రులిద్దరూ తనని కంగ్రాట్యులేట్ చేస్తుంటే శంకరు రెండుచేతులమధ్య తల దూర్చి నిస్సత్తువగా కూలబడ్డాడు. అతని వాలకం చూసి వాళ్ళు అతనిని. చివాట్లు పెట్టేరు నీకేమైనా బుద్ధి అనేది ఉందా అసలు! అత్తవారింటికెళ్ళే కొత్త పెళ్ళికూతురిలా ఏమిటా వెధవ ఏడుపు మొహం నువ్వూనూ? మేము యీ పంజరంలోనుండి ఎప్పుడు బయటపడతామా, ఎప్పుడు స్వేచ్ఛగా, స్వతంత్రంగా మాంచిహోదాలో బ్రతుకుదామా అని ఆరాటపడుతుంటే నువ్వు కలసివచ్చిన అదృష్టానికి కలతపడతావేమిటిరా ఫూల్! చక్కగా ఎల్లుండే వెళ్ళి ఉద్యోగంలో చేరు. మన ప్రొఫెసరు బుర్ర మట్టిదయినా మనసు మాత్రం బంగారంలా, పాపం నీకోసం చూడు ఉద్యోగంకూడా చూసి పెట్టేడు.ఏ ప్రొఫెసరుకుంటుందిరాఅంత ఇంటరెస్టు తనక్రింద పనిచేసేవాళ్ళమీద! పో! రెక్కలు వచ్చిన పక్షిలా ఎగిరిపో!

చలో ఢిల్లీ చలో!" అన్నారు. అప్పటికి వాళ్ళ మాటలు కొంతవరకు తలకెక్కేసరికి శంకరానికీకూడా వాళ్ళన్న దాంట్లో అబద్ధమేమీ లేదనిపించింది.

"ఇంకా ఎన్నాళ్ళిలా యౌవనాన్ని యీ లేబొరేటరీలలో వ్యర్థం చేసుకుంటూ గడపటం?" అనిపించింది తనకి సిద్ధంగా ఒక మాచ్ కూడా స్థిరపడివుంది. ఉద్యోగంలో చేరి వెంటనే పెళ్ళిచేసికొని జీవితంలో స్థిరపడిపోవాలి. అన్న ఆశ ఆతనిలోకూడా కదలాడసాగింది.

వెంటనే ప్రొఫెసరు చెప్పినట్లు చెయ్యటానికే నిశ్చయించుకొన్నాడు.

మరో ఏడునెలలు గడచినయ్, శంకరు ఢిల్లీ యూనివర్శిటీలో రీడరుగా చేరేడు. అందమైన చిన్నయింట్లో చుట్టూ అందమైన గార్డెన్‌తో, ప్రక్కనే అంతకన్న అందమైన భార్యతో ఖులాసాగా కాలం గడుపుతున్నాడు శంకరు. ఒక రోజు ఉదయం చలికి వెరచి ఇంటిలోనుంచి బయటికి రావడానికి మనసొప్పక మంచంమీదనే పడుకునిఉన్న శంకరుకి బెడ్ కాఫీ అందిస్తూ ఆనాటి న్యూస్ పేపరుని చేతిలో పెట్టుకుని అతని భార్య సునంద "ఏమండీ అన్నట్టు! మీరు ప్రొఫెసరు రంగారావుగారి క్రింద కదూ పనిచేసింది?" అనడిగింది.

'ఔను యేం? ఆయనకేమయిందేమిటి? చచ్చాడా ఏమిటి?" అన్నాడు వేడివేడి కాఫీని చప్పరిస్తూ.

"ఛా! పాపం అవేం మాటలండీ! ఎంతైనా గురువు

గారుకదా అలాంటిమాటలనవచ్చా? చూసేరా? ఆయనకు భారతప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదునిచ్చిందట!" అన్నది.

కాఫీ తాగుతున్నవాడల్లా ఆ పేపే ఏమిటి? ప్రొఫెసరు రంగారావుకా? పద్మశ్రీ బిరుదా?, ఎవరిచ్చేరు? అన్నాడు.

"ఎవ్వరివ్వటమేమిటండీ? నిన్న జనవరి 26 రిపబ్లికు డే నాడు భారతప్రభుత్వం ఆయనకు 'పద్మశ్రీ' బిరుదునిచ్చిందండీ! అయినా మీ ప్రొఫెసరునిగురించి అలా మాట్లాడతారేమండీ. ఆయన మీలా గొప్ప మేధావి అని మీరే స్వయంగా మీ ఫ్రెండ్సుతోనూ, మిగతావాళ్ళతోనూ చెపుతుండగా నేను చెవులారా విన్నాను. ఇప్పుడాయన్ను గురించి అంత తేలిగ్గా మాట్లాడతారేమిటి?" అంటూ ఆశ్చర్యపోయింది సునంద...

"బయటవాళ్ళతో మాట్లాడేటప్పుడు నేను డాక్టరు శంకరుని ప్రొఫెసరు రంగారావుగారి శిష్యుణ్ణి. అందుకే అప్పుడే ఆయన్నిగురించి పొగుడుతూ మాట్లాడటం తప్పనిసరి అవుతుంది నాకు. కాని యిప్పుడు నీతో నేను నీ భర్తగా మాట్లాడుతున్నాను. అందుకే నిజం మాటలాడుతున్నాను. ఏదీ ఆ పేపరిలా యివ్వు, ఇంతకూ ఆ 'పద్మశ్రీ'ని ఎలా సంపాదించాడో చూద్దాం అంటూ పేపరు తీసుకుని చూసేడు శంకరు.

పాస్‌పోర్టు సైజులోని ప్రొఫెసరు రంగారావు ఫోటో మీద మొట్టమొదటగా అతని కళ్ళు వాలినయ్. అవే

బుంగమీసాలు అవే గాజు గోళాల్లాంటి కళ్ళు సందేహం లేదు. సాక్షాత్తూ ఆయన ప్రొఫెసరే! ఆ ఫోటో క్రింద వ్రాసి ఉన్న వాక్యాలను చదివేడు శంకరు. అందులో యిలా ఉంది. "గోధుమపంట నాశనంచేసే ఒకరకమైన ఫంగస్ యొక్క జీవితచరిత్రను, దానిని నిర్మూలించే మార్గాలను కూడా కనిపెట్టి వ్యవసాయరంగానికి గొప్ప సేవచేసిన మేధావి పాథాలజీ ప్రొఫెసరు అయిన శ్రీ రంగారావుకు "పద్మశ్రీ" బిరుదునిచ్చి భారతప్రభుత్వం సన్మానించింది.

ఆ వాక్యాలను చదువుతూనే శంకరు కళ్ళు బైర్లు క్రమ్మినయి, చేతిలోని కాఫీ కప్పు కాస్తా జారి క్రిందపడి, ముక్కలైపోయింది.

సునంద కంగారుగా లేచి "అరె ఏమిటండీ? ఒక్కసారిగా ఎందుకలాగైపోయేరు? ఏమిటలా ఆలోచిస్తున్నారు?" అనడిగింది.

"ఏంలేదు. మా పద్మశ్రీ ప్రొఫెసరుగారినిగురించే ఆలోచిస్తున్నాను. అంతకంటే యేంలేదు" అంటూ పొడిగా నవ్వేడు డాక్టరు శంకరు.